అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి


జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: స్థానిక కలెక్టరేట్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరుపేదలైన వారికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ధర్నా నిర్వహించారు. ప్రజా సంఘాల ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకు ఇస్తానన్న డబుల్ బెడ్రూం ఇళ్లు, ఖాళీ స్థలం ఉన్న వారికి ఇస్తానన్న రూ.5 లక్షలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 8 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఆరోపించారు. పట్టణంలో దాదాపుగా 6వేల మంది పేదలు అద్దె ఇళ్లల్లో మగ్గుతున్నారని, ప్రజా సంఘాల ఐక్యవేదిక ద్వారా సర్వే చేస్తే నిజాలు బయటపడ్డాయన్నారు. కేవలం 92బిళ్లు మాత్రమే నిర్మించి పేదలందరికి ఇస్తామనడంలో వాస్తవం లేదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కందికొండ గీత, శ్రీనివాసులు, కాశన్న, తారాసింగ్, రామయ్య, అశోక్, కొట్ర నవీన్, సత్యనారాయణ, కుర్మయ్య, సత్యం, బాలస్వామి, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా

అచ్చంపేట రూరల్: పట్టణంలో ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చిన లబ్ధిదారులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని, స్థలం ఉండి ఇల్లు నిర్మాణం చేసుకోలేని నిరుపేదలకు రూ. 5లక్షల ఆర్థికసాయం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో వివిధ కాలనీల ప్రజలు ధర్నా నిర్వహించారు. అంతకుముందు పట్టణంలోని ప్రధాన రహదారి గుండా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలోని సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దేశ్యానాయక్, మల్లేష్, శంకర్‌నాయక్, సైదులు, తిర్పతమ్మ పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: మున్సిపాలిటీ పరిధిలో ఇళ్లు లేని నిరుపేద, మధ్య తరగతి వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

పెద్దకొత్తపల్లి: బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీదేవీ, భూదేవీ వేంకటేశ్వర స్వామి రథోత్సవం ఆదివారం రాత్రి నిర్వహించారు. మండలంలోని తిరుమలాపూర్ అంతా గోవిందనామస్మరణతో మార్మోగింది. స్వామివారి రథాన్ని తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. రథోత్సవంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, పలువురు పాల్గొని పూజలు చేశారు.

క్లుప్తంగా

ప్రజావాణికి దరఖాస్తులు నిల్

లింగాల: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పలు శాఖల అధికారులు పాల్గొని సమయం వరకు కూర్చొని వెళ్లారు. ప్రజల నుంచి వినతుల కోసం అధికారులు ఎదురు చూడక తప్పలేదు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, ఏఓ నాగార్జున రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, హెచ్‌ఏ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

దండోరా ధర్నా విజయవంతం చేయండి



పెద్దకొత్తపల్లి: దండోరా ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు రాము అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టి రెండవ విడుత లబ్ధిదారులను ఎంపిక చేయకపోవడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో విష్ణు, గోపి, విజయ్, నాగరాజు, ఎల్లస్వామి, శంకర్, నర్సింహ పాల్గొన్నారు.

పండిట్, పీఈటీలకు పదోన్నతులు ఇవ్వాలి



కందనూలు: భాషా పండిట్, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు తెలుగు, హిందీ భాషా పండిట్‌లు, పీఈటీలకు వెంటనే పదోన్నతులు కల్పించాలన్నారు. స్వరాష్ట్రంలో న్యాయం ఆశించిన మాకు, 9ఏళ్లు అవుతున్నా పదోన్నతులకోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు దాపురించాయన్నారు. అనంతరం డీఈఓ గోవిందరాజులుకు వినతిపత్రం అందజేశారు.

మిత్రుడికి ఆర్థిక సాయం



తెలకపల్లి: మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో పని చేస్తున్న రాము ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. అతని మెరుగైన వైద్యం కోసం మిత్రులు సోమవారం రూ.50 వేలు అందజేశారు. కార్యక్రమంలో రమేష్, శంకరయ్య, చంద్రయ్య, విజయ్‌గౌడ్, ఆంజనేయులు గౌడ్, సాయిబాబు, కృష్ణయ్య, శివ, శ్రీనివాసులు, శ్రీరాములు పాల్గొన్నారు.

పార్కు పనుల పరిశీలన

కల్వకుర్తి: మున్సిపాలిటీ ఆవరణలో చేపడుతున్న పార్కు పనులను మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం సోమవారం పరిశీలించారు. నక్షత్ర పార్కు పనులను నిబంధనల ప్రకారం వేగంగా చేపట్టాలన్నారు. ఆయన వెంట కమిషనర్ అక్షిత్‌కుమార్, ఏఈ శివకృష్ణ ఉన్నారు. 8వ వార్డులో కంటివెలుగు శిబిరాన్ని పరిశీలించారు. 21వ వార్డులో డ్రెయినేజీ పనులు ప్రారంభించారు.

సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించాలి

అచ్చంపేట రూరల్: గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు సెలవు ప్రకటించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ తులసీరాం, జెడ్పీటీసీ మంత్రియానాయక్ కోరారు. సోమవారం ఆర్డీఓ పాండునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు గోపాల్‌నాయక్, జైపాల్‌నాయక్, దేశ్యానాయక్, బాలునాయక్, పర్వతాలు, వసురాం, పాండు, హన్మంత్, శంకర్ పాల్గొన్నారు.

అర్థమయ్యే రీతిలో బోధించాలి

తెలకపల్లి: విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో ఉపాధ్యాయులు బోధించాలని ఎంఈఓ చంద్రుడు అన్నారు. సోమవారం మండలంలోని ఆలేరు ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో చేపడుతున్న పనులను పరిశీలించారు. వాటి పురోగతిని అడిగి తెలుసుకుని, ఈ నెల 20వ తేదీ వరకు పూర్తి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థులకు ఎలా బోధిస్తే అర్థం చేసుకుంటారో అ స్థాయిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ప్రశ్నించే గొంతును గెలిపించుకుందాం



కల్వకుర్తిరూరల్: ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో ప్రశ్నించే గొంతును గెలిపించుకుందామని ఎస్టీయూటీఎస్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి భుజంగరావు పిలుపునిచ్చారు. సోమవారం కల్వకుర్తి, ఊర్కొండ మండలాలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి ఓటు వేయాలని కోరారు. మేధావులకు మాత్రమే ఉన్న ఎమ్మెల్సీ అవకాశాన్ని కాపాడుకుందామన్నారు. విద్యారంగంలో కలంకం తెస్తున్న 317 జీవోపై ప్రభుత్వాన్ని నిలదీస్తానన్నారు. కార్యక్రమంలో సుదర్శన్, శ్రీధర్‌రావు, సతీష్, రాజేంద్రప్రసాద్, చెన్నకేశవులు, జంగయ్య, జమీల్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్సీలు విఫలం

అచ్చంపేట రూరల్: విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్సీలు విఫలమయ్యారని తపస్ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి ఆరోపించారు. సోమవారం ఉమామహేశ్వరంలో ప్రత్యేక పూజలు చేసి నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సురేఖ, శ్రీను, పెంట్యానాయక్, శేఖర్, అరవింద్, జగదీష్, మాధవి, నిర్మలా, రమాదేవి, రాంగోపాల్‌గౌడ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా పవన్‌కుమార్



కోడేరు: మండల ఎంపీడీఓగా పవన్‌కుమార్ సోమవారం విధుల్లో చేరారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీఓ ప్రభాకర్ కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారం చేస్తానని తెలిపారు.

ప్రెస్‌క్లబ్ కమిటీ ఏర్పాటు

వెల్దండ: మండల ప్రెస్‌క్లబ్ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగరాజుగౌడు, ప్రధాన కార్యదర్శిగా పూరి రమేష్, కోశాధికారిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, రవీందర్‌రావు, సహాయ కార్యదర్శిగా రామకృష్ణ, మల్లేష్, గౌరవ అధ్యక్షుడిగా జక్కుల కృష్ణయ్య, గౌరవ సలహాదారులుగా పురుషోత్తంరెడ్డి, తంబాలు, రాజయ్య, కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మృతి


చెన్నకిష్టారెడ్డి (ఫైల్)

పెద్దకొత్తపల్లి: నక్కలపల్లి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కొత్త చిన్నకిష్టారెడ్డి(94) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాల్‌నర్సింహ, ఏసయ్య, శ్రీనివాసులు, విజయుడు, నర్సింహులు ఆయన భౌతికకాయానికి నివాళులు అర్పించారు. ఆయన మృతి సీపీఐ పార్టీకి తీరని లోటని అన్నారు. వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు తరలి వచ్చి నివాళులు అర్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం


శ్రీనివాసులు (ఫైల్)

అచ్చంపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన సంఘటన సోమవారం రాత్రి మండలంలోని నడింపల్లి సమీపంలో చోటు చేసుకుంది. ఉప్పునుంతల మండలం కాంసానిపల్లికి చెందిన మాచర్ల శ్రీనివాసులు(35) అచ్చంపేట మండలం నడింపల్లికి తన బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో హాజీపూర్ వైపు వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ ముందుభాగం బాగా దెబ్బతినడంతో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఉండొచ్చని స్థానికులు చెబుతున్నారు. కాంసానిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బడ్జెట్‌లో నిరుద్యోగులకు అన్యాయం


బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న బీఎస్పీ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: శాసన సభలో హరీష్‌రావు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిరుద్యోగభృతి, గిరిజన బంధు ఊసే లేదని బీఎస్పీ నాయకులు అన్నారు. సోమవారం అంబేద్కర్ చౌరస్తాలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. 2018లో మ్యానిఫెస్టోలు పెట్టిన హామీలను నెరవేర్చడంలో ఈ బడ్జెట్ విఫలమైందన్నారు. రైతులకు ఇస్తానన్న రూ.లక్ష రుణమాఫీ, డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు, నిరుద్యోగ భృతి లాంటి విషయాల్లో స్పష్టత ఇవ్వలేదని, కేవలం కొంత బడ్జెట్‌ను రుణమాఫీకి, ఇళ్ల నిర్మాణాలకు కేటాయించి చేతులు దులుపుకున్నట్లు విమర్శించారు. ఇంటి స్థలం ఉన్న వారికి రూ.3 లక్షలు ఇస్తాననడం విడ్డూరంగా ఉందన్నారు. నిరుద్యోగులను, గిరిజనులు, రైతులను, పేదలను పూర్తిగా మోసం చేశారని ఈ అంకెల గారడి బడ్జెట్‌ను ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. 13న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ అధ్యక్షుడు పృథ్వి, మహేష్, కల్యాణ్, శివశంకర్, నాగులు, చెన్నయ్య, గోపాల్ తదితరులు ఉన్నారు.

హామీలు అమలు చేయలేదు

తెలకపల్లి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని బీఎస్పీ నాయకులు ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి కుమార్ మాట్లాడుతూ రైతులకు రూ.లక్ష రుణమాఫీ నేటికి చేయలేదని, ప్రస్తుతం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రుణమాఫీకి ఎలాంటి నిబంధనలు రూపొందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తుందని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడిస్తామన్నారు.

కాంగ్రెస్‌తోనే రైతులకు మేలు


వంగూరులో మాట్లాడుతున్న వంశీకృష్ణ

వంగూరు: కాంగ్రెస్ పార్టీ పాలనలోనే రైతులకు మేలు కలుగుతుందని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన హాత్ సే హాత్ జోడో యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ఉచిత కరెంట్, సబ్సిడీ విత్తనాలు, పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడంతో రైతులకు ఎంతో మేలు కలిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2లక్షల రుణమాఫీ చేయడంతోపాటు ధరణి పోర్టల్ రద్దు చేసి రైతులకు మద్దతు ధర కలిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పండిత్ రావు, రమేష్‌గౌడ్, జనార్దన్, సైదులు, సత్యం, రమేష్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మార్చాలలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు.

పెద్దకొత్తపల్లి: హాత్ సే హాత్ జోడో పాదయాత్రను టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి అభిలాష్‌రావు నాయినోనిపల్లి మైసమ్మను సోమవారం దర్శించుకుని ప్రారంభించారు. నాయినోనిపల్లి, చిన్నకొత్తపల్లిలో ప్రజలు రైతులను పలకరిస్తూ వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు.

వేరుశనగలో అన్ని దశలు కీలకం


చీడపీడల గురించి వివరిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

బిజినేపల్లి: యాసంగిలో రైతులు ఎక్కువగా వేరుశనగ పంటను సాగు చేస్తారని, ఈ పంట సాగులో విత్తు నుంచి కోత వరకు కీలకమైన దశలని పాలెం కేవీకే సమన్వయకర్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నందివడ్డెమాన్‌లో వేరుశనగలో సమగ్ర సస్యరక్షణ యాజమాన్యంపై క్షేత్ర దినోత్సవం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వేరుశనగలో విత్తుకునే సమయంలో సరైన నేలలు ఎంచుకోవడమే కాకుండా విత్తన శుద్ధి చేసుకోవాలని, దుక్కులు, నీటి తడులు, చీడ పీడలను ఎప్పటికప్పుడు గుర్తించి నివారణ చేపట్టే మార్గాలు తెలిసి ఉండాలని సూచించారు. పంట కోత దశలో కూడా జాగ్రత్తగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శైలా, ఏఈవో మధు, రైతులు పాల్గొన్నారు.

చెంచుపెంట సందర్శించిన విద్యార్థులు



లింగాల: మండలంలోని ఎర్రపెంటను సోమవారం కొల్లాపూర్ పీజీ కళాశాల సోషల్ వర్క్ విద్యార్థులు సందర్శించారు. పెంటలో అభివృద్ధి పనులపై అధ్యాయనం చేశారు. సర్పంచ్‌లో అక్కమ్మ చేస్తున్న అభివృద్ధి, చెంచుల స్థితిగతులపై విద్యార్థులకు వివరించారు. పెంటలో కోనేర్ సంస్థ నిర్వహించే కార్యక్రమాలను సంస్థ అధికారి పెద్దులు తెలిపారు. పీజీ కళాశాల సోషల్ వర్క్ విద్యార్థులు తమ చదువుల్లో భాగంగా ఇలాంటి గ్రామ అధ్యాయనం చేపట్టినట్లు అధ్యాపకుడు దేవరాజు తెలిపారు.

పత్తిమిల్లులో అగ్ని ప్రమాదం

వెల్దండ: మండలంలోని రాఘయపల్లిలో శ్రీసిద్ధి వినాయక కాటన్ మిల్లు సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. మిల్లులో మిషన్ నడుస్తుండగా విద్యుత్ వైర్ల నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. అప్రమత్తమైన సిబ్బంది మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. కల్వకుర్తిలో ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకోని అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దాదాపుగా 50 క్వింటాళ్ల పత్తి వరకు కాలిపోయిందని అంచనా వేశారు.


మంటలు ఆర్పుతున్న సిబ్బంది

కొనసాగుతున్న 'కంటివెలుగు' శిబిరాలు

కొల్లాపూర్: కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యుడు చంద్రశేఖర్ సూచించారు. సోమవారం 9వవార్డులో శిబిరాన్ని కౌన్సిలర్ రహీంపాష శిబిరాన్ని ప్రారంభించారు.

దోమలపెంట(అచ్చంపేట): రాష్ట్ర సరిహద్దులో ఈగలపెంటలోని జెన్‌కో కాలనీలో కంటి వెలుగు శిబిరం నిర్వహించారు. డా.అభిలాష్, నవీన్ ఆధ్వర్యంలో సిబ్బంది రాజేష్, రాహుల్ సేవలందిస్తున్నారు. మరో రెండు రోజులు ఈగలపెంటలోని నిర్వహించి తదుపరి పాతాళగంగ ప్రాంతంలో నిర్వహిస్తామని డాక్టర్లు తెలిపారు.

బిజినేపల్లి: మండలంలోని గంగారంలో రైతువేదిక వద్ద ఈ నెల 27వ తేదీ వరకు కంటి వెలుగు నిర్వహించనున్నట్లు లట్టుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్ సోమవారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి


కొల్లాపూర్‌లో జెండా ఎగురవేస్తున్న సాయికృష్ణగౌడ్

కొల్లాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని బీజేపీ శ్రేణులకు జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని కార్యాలయంలో మండల స్థాయి కార్యవర్గ సమావేశాలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు సాయికృష్ణగౌడ్ పార్టీ జెండాను ఎగురవేసి సమావేశాలను ప్రారంభించారు. రాష్ట్రంలో భవిష్యత్ బీజేపీదే అని అన్నారు. సమావేశంలో శ్రీనివాస్‌యాదవ్, జలాల్ శివుడు, సత్యనారాయణగౌడ్, మల్లేష్‌యాదవ్, మహేష్ తదితరులున్నారు.

బీజేపీని బలోపేతం చేద్దాం

పెంట్లవెల్లి: బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతం కోసం కష్టపడాలని సూచించారు. ప్రసాద్, శ్రీనివాసుయాదవ్, ఖలీల్‌పాషా, వెంకటేష్ పాల్గొన్నారు.

తాడూరు: వచ్చే ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దిలీపాచారి పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణోత్సవం

వెల్దండ: మండల కేంద్రంలోని అయ్యబావి వీరభద్రేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో పంచాక్షరి పూజలు చేశారు. భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం పార్వతీ పరమేశ్వర, వీరభద్రేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు.

రథోత్సవంలో అపశృతి

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేట పంచాయతీలో ఉన్న రామగిరి సీతారామచంద్రస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి పలు గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కాగా రథాన్ని లాగుతున్న సందర్భంలో రఘుపతి పేటకు చెందిన సాయి, శివ, సాయిబాబ, సత్యనారాయణలకు గాయాలయ్యాయి. వారి కాళ్లపై నుంచి రథం వెళ్లడంతో గాయాలపాలయ్యారు. వారందరిని వెంటనే ఆస్పత్రికి తరలించారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

కల్వకుర్తిరూరల్: మిత్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని గ్రంథాలయానికి గ్రూప్ 1, 2, 4లతో పాటు ఇతర పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు అందజేశారు. పరీక్షలకు సిద్ధమయ్యే యువత అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఫౌండేషన్ సభ్యులు కోరారు.

బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు

కల్వకుర్తిరూరల్: బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని కార్మిక శాఖ అధికారి మహేందర్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ క్యాంటీన్‌లో తనిఖీ చేశారు. పనిలో ఉన్న బాలకార్మికుడిని గుర్తించారు. హోటల్ యజమానిపై కేసు నమోదు చేసి బాల కార్మికుడిని ఇంటికి పంపించినట్లు తెలిపారు.

సాతాపూర్‌ను మండలంగా ప్రకటించండి

పెద్దకొత్తపల్లి: సాతాపూర్‌ను కొత్త మండలంగా ఏర్పాటు చేయాలని సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్దన్‌రెడ్డికి వినితిపత్రాన్ని అందజేసినట్లు నాయకులు తెలిపారు. మండల కేంద్రానికి అనుకూలంగా ఉందని తెలిపారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు మల్లేష్, శివ, తిరుమల్ తెలిపారు.

పర్యావరణంపై అవగాహన

తాడూరు: మండలంలోని సిర్సవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం పర్యావరణంపై అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయుడు కార్తీక్ కుమార్ 3, 4, 5 తరగతి విద్యార్థులను గ్రామంలో పర్యటింపజేసి కుండల తయారీకి కావాల్సిన వస్తువులు ఎలా తయారు చేస్తారనే అంశాలపై, అంగన్‌వాడీ కేంద్రంలో బాలబాలికలు, గర్భిణులకు అందించే సౌకర్యాలు విద్యార్థులకు వివరించారు. మీ సేవా కేంద్రాన్ని సందర్శించి వేలి ముద్ర ద్వారా నగదు లావాదేవీలు, ధ్రువపత్రాలు, ఆన్‌లైన్ కార్యక్రమాలపై వివరించారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

బల్మూర్: మండలంలోని నాగర్‌కర్నూల్–అచ్చంపేట ప్రధాన రహదారిలోని గట్టుతుమ్మెన్ స్టేజి వద్ద ఆదివారం రాత్రి గుర్తు తెలియని ఆటో ఢీ కొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ సోమవారం తెలిపారు. గాయపడిన వ్యక్తిని అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నట్లు తెలిపారు. ఈయన పూర్తి వివరాలు తెలియడం లేదని, ఎవరైనా సంబంధీకులు ఉంటే 9490615617 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

19న గిరిజన మహాసభలు

కొల్లాపూర్: గిరిజన సంఘం జిల్లా మహాసభలు ఈనెల 19న అచ్చంపేట పట్టణంలో నిర్వహించనున్నట్లు నాయకులు వెల్లడించారు. సోమవారం పట్టణంలో నాయకులు సమావేశమయ్యారు. మహాసభలకు గిరిజనులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో అశోక్, గోవిందు, గోపాల్, తిరుపతినాయక్ పలువురు ఉన్నారు.

బాలికలకు అండగా షీటీం: అడిషనల్ ఎస్పీ



తెలకపల్లి: బాలికలు అండగా షీటీం ఉంటుందని అడిషనల్ ఎస్పీ రామేశ్వర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి వేధింపులు ఎదురైనా షీటీంను వినియోగించుకోవాలన్నారు. షీటీం ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారన్నారు. మహిళలు, బాలికలు ధైర్యంగా ముందుకెళ్లాలన్నారు. వేధింపుల నుంచి బయట పడేందుకు షీటీం వాట్సాప్ నెంబర్ 871265676 లేదా, 100కు ఫోన్ చేసి సాయం పొందాలని సూచించారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అమ్మాయిలు పాఠశాలలో భద్రంగా ఉన్నప్పటికి, బయటకు వెళ్లే సమయంలో వేధింపులకు గురవుతున్నారని, వెంటనే షీటీంకు ఫోన్ చేస్తే సమస్య పరిష్కారమవుతుందని షీటీం ఇన్‌చార్జ్ విజయలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాయిలత, వెంకటయ్య, హెడ్‌కానిస్టేబుల్ నారాయణ, ఊశన్న పాల్గొన్నారు.

నల్లమలలో ట్రెయినీ బీఎఫ్‌ఓల పర్యటన

మన్ననూర్: దూలపల్లిలో బీట్ ఆఫీసర్లుగా శిక్షణ పొందుతున్న అటవీశాఖ అధికారులు సోమవారం నల్లమలలోని అభయారణ్యంలో పర్యటించారు. 34 మంది మన్ననూర్, దోమలపెంట అటవీశాఖ రేంజ్ పరిధిలో వివిధ ప్రాంతాలను పరిశీలించారు. వృక్షాలను, వన్యప్రాణుల కదలికలను ప్రత్యక్షంగా వీక్షించారు. తిరుగు ప్రయాణంలో మన్ననూర్‌లోని వనమాలికా ప్రాంగణంలో తమ అనుభవాలను ఉన్నతాధికారులతో వివరించారు. వారి వెంట ఎఫ్‌ఆర్‌ఓలు ప్రభాకర్, ఈశ్వర్, ఆదిత, సిబ్బంది తదితరులు ఉన్నారు.


ఉన్నతాధికారులతో సమావేశమైన బీఎఫ్‌ఓలు